క్లుప్తంగా

విద్యుత్ లైన్ల సమస్యపై వినతి


సీఎండీకి వినతి పత్రం అందిస్తున్న శ్రీధర్

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు పరిధిలో విద్యుత్ లైన్ల సమస్యపై ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్‌కు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ వినతి పత్రం అందించారు. నగరంలోని ఈపీడీసీఎల్ కార్యాలయంలో సీఎండీని శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా నగరంలో ప్రధానంగా ఉన్న విద్యుత్ సమస్యలపై చర్చించారు. 52వ వార్డులో తాసీన్ మసీద్ మొదలుకుని జిందాల్ భవన్, సంజీవయ్యనగర్, నేతాజీనగర్, మత్రిపాలెం ఉడా లేఅవుట్ వరకు హెచ్‌టీ లైన్లను భూగర్భ కేబుల్ ద్వారా ఆధునీకీకరించాలని కోరారు.

కనీస రక్షణ లేకుండా.. విద్యుత్ లైన్ల పనులు


కనీస రక్షణ ఏర్పాట్లు లేకుండా విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో సిబ్బంది

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం విద్యుత్ లైన్ల మరమ్మతు పనులు చేపట్టారు. అయితే ఈ పనుల్లో ఉన్న సిబ్బందికి కనీస రక్షణ ఏర్పాట్లు కూడా లేకపోవడం గమనార్హం. కోరమాండల్ రక్షణ గోడ వద్దనున్న విద్యుత్ స్తంభం పైకి ఎక్కి, తుప్పు పట్టిన వైర్లు, కండక్టర్ల మార్పు పనుల్ని చేపట్టారు. వీరు కనీసం సేఫ్టీ బెల్ట్‌లు కూడా కట్టుకోలేదు. ఇంత ప్రమాదకరంగా విధులు నిర్వహిస్తున్న వీరిని చూసినవారు.. పొరపాటున కాలుజారితే పరిస్థితి ఏంటని? భయాందోళన వ్యక్తం చేశారు.

ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ

సింధియా: భారత ప్రభుత్వం స్థాపించిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైం షిప్ బిల్డింగ్ (సెమ్స్)లో వైజాగ్ జనరల్ కార్గో బెర్త్ ప్రై.లి. సంస్థ సౌజన్యంతో ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించనున్నట్లు సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18–27 ఏళ్ల మధ్య వయస్కులై ఇంటర్, ఐటీఐ, డిప్లొమా మెకానికల్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువత దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హులైనవారు సింధియా జంక్షన్ సమీపంలోని సెమ్స్ కేంద్రంలో గానీ, 8688411100, 8331901237, 0891-2704010 ఫోన్ నంబర్ల ద్వారా గానీ ఈ నెలాఖరులోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

ఘనంగా గరీబ్‌నవాజ్ చందనోత్సవ వేడుకలు


ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మత్రిపాలెం: హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ చందనోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. 53వ వార్డు మత్రిపాలెం జాకీర్ హుస్సేన్‌నగర్ మసీదులో ఈ అల్ ఖదీర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఖురాన్ పఠించి, మధ్యాహ్నం పవిత్ర నమాజ్‌ను ఆచరించారు. సాయంత్రం చాదర్(పవిత్ర వస్త్రం) ప్రదర్శిస్తూ చిన్నారులు శాంతి ర్యాలీ నిర్వహించారు. మత్రిపాలెం రైల్వే క్వార్టర్స్ వద్ద ఉన్న హజ్రత్ ఖాజా గరీబ్ నవాజ్ నిషానీ షరీఫ్ వద్ద జెండా ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో దావత్ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడలకు C/o గోపాలపట్నం హైస్కూల్

గోపాలపట్నం జిల్లా పరిషత్ హైస్కూల్ క్రీడా ప్రాంగణం ఔత్సాహిక క్రీడాకారులెందరికో దారిచూపుతోంది. ఇక్కడి క్రీడా సంఘాలు క్రీడల పట్ల ఆసక్తి ఉన్న విద్యార్థుల్ని గుర్తించి తర్ఫీదునిస్తున్నాయి. పలు రకాల క్రీడల్లో నైపుణ్యం పెంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచేలా చేస్తున్నాయి. ప్రధానంగా ఈ మైదానంలో బాక్సింగ్, బాల్‌బ్యాడ్మింటన్, కరాటేలో శిక్షణ పొంది రాణిస్తున్నవారు ఎందరో ఉన్నారు.


క్రీడా ప్రాంగణంలో విద్యార్థుల సందడి (ఫైల్)

- గోపాలపట్నం హైస్కూల్ మైదానంలో క్రీడల్లో ప్రత్యేక శిక్షణ
- బాక్సింగ్, బ్యాడ్మింటన్, కరాటేలో రాణిస్తున్న క్రీడాకారులు
- అంతర్జాతీయ స్థాయిలో శిక్షణ ఇస్తున్న కోచ్‌లు

గోపాలపట్నం: క్రీడలు ఆరోగ్యంతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణను పెంపొందిస్తాయి. నగర పరిధిలో మంచి క్రీడా ప్రాంగణం ఉన్న పాఠశాల గోపాలపట్నం హైస్కూల్ మాత్రమేనంటే అతిశయోక్తి కాదు. ఈ మైదానం ఇక్కడి విద్యార్థులకే కాకుండా, పరిసర ప్రాంతాలకు చెందిన ఔత్సాహిక క్రీడాకారులకు ఎంతగానో ఉపయోగపడుతోందని స్థానికులు ఆనందంగా చెప్తారు. ఇక్కడున్న బాలికల హైస్కూల్, కో ఎడ్యుకేషన్ హైస్కూల్ విద్యార్థులు ఇదే మైదానాన్ని వినియోగించుకుని పలు క్రీడల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. బాక్సింగ్, బాల్ బ్యాడ్మింటన్, కరాటే వంటి పలు క్రీడల్లో బంగారు పతకాలు సాధించారు.

బాక్సింగ్ శిక్షణలో భేష్

ఈ గ్రౌండ్‌లో వైఎఫ్ బాక్సింగ్ క్లబ్ కోచ్‌లు ఎస్ఎస్ ప్రభాకర్, కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గత 15 ఏళ్లుగా బాక్సింగ్ క్రీడలో శిక్షణ ఇస్తున్నారు. చాలా మంది బాక్సింగ్‌పై ఆసక్తితో ఇక్కడికి వస్తున్నారని శిక్షకులు చెబుతున్నారు. వీరి శిక్షణలో రాటు దేలి, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించి, ఉన్నతోద్యోగాల్లో స్థిరపడినవారూ ఉన్నారు. ఎప్పటికప్పుడు బాక్సింగ్ పోటీలు నిర్వహించి, ఔత్సాహిక క్రీడాకారుల్లో ఉత్సాహాన్ని నింపడంలో వైఎఫ్ బాక్సింగ్ క్లబ్ మేటిగా నిలుస్తోందనడంలో సందేహంలేదు.

బాల్ బ్యాడ్మింటన్‌పై ఆసక్తి

గోపాలపట్నం హైస్కూల్లో పీఈటీల పర్యవేక్షణలో విద్యార్థులు బాల్ బాడ్మింటన్‌లో శిక్షణ పొందుతున్నారు. అంతేకాకుండా రైల్వే ఉద్యోగి అయిన స్టూడెంట్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సంస్థ ఇదే మైదనంలో ప్రత్యేక శిబిరాలు నిర్వహించి పలువురికి శిక్షణ అందిస్తోంది. అసోసియేషన్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే స్థాయిలో మెలకువలు నేర్పుతున్నారు. శిక్షకుడు పోకల రమణ చూపుతున్న చొరవతో ఇక్కడ ఔత్సాహిక క్రీడాకారుల సంఖ్య పెరుగుతోంది.

సౌకర్యాలు మెరుగుపడాలి

ఈ గ్రౌండ్‌లో శిక్షణపై ఔత్సాహిక క్రీడాకారుల్లో ఆసక్తి ఎక్కువగానే ఉంది. అయితే కొన్ని సౌకర్యాలను మెరుగుపరిస్తే బాగుంటుందని వారు చెప్తున్నారు. వర్షం కురిస్తే నీరు నిలిచిపోయి మైదానంలో ప్రాక్టీస్‌కు వీల్లేని పరిస్థితి. ఆ సమయాల్లో మైదానంలో ఆడేవారు గాయాలపాలవుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిస్తే ఈ సమస్య పరిష్కారమవుతుందని కోరుతున్నారు. మరోవైపు సాయంత్రం సమయంలో మందుబాబులు, ఆకతాయిలు, అల్లరి మూకల బెడద ఎక్కువగా ఉంది. వీరి ఆటకట్టించాలని విద్యార్థులు వేడుకుంటున్నారు.


బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు


శిక్షణ పొందుతున్న విద్యార్థులు

మేరీకోమ్ ఆదర్శం



బాక్సింగ్‌లో అత్యున్నత ప్రతిభ కనబరిచి, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నది నా ఆకాంక్ష. నాకు మేరీకోమ్ ఆదర్శం. ఆమె సాధించిన ఘనత ఎంతో గర్వకారణం. ఆ ప్రేరణతోనే బాక్సింగ్‌లోకి వచ్చా. ఇప్పటికే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పలు పోటీల్లో పాల్గొన్నా. బంగారు పథకాలు సాధించా. మా కోచ్ శిక్షణలో మరింతగా రాణిస్తా.
– ఎం.తేజస్విని, బాక్సింగ్ విద్యార్థి, గోపాలపట్నం

ఒలింపిక్స్‌లో ఆడాలన్నదే ఆశ



బాక్సింగ్‌లో ఒలింపిక్స్‌లో భారత్ తరపున ఆడి మెడల్ తీసుకొస్తా. మువ్వన్నెల జెండాను గౌరవంగా నా భుజాలపై మోయాలన్నది ఆశ. మా కోచ్ మంచి మెలకువలు నేర్పిస్తున్నారు. బాక్సింగ్ క్రీడలో క్రమశిక్షణ అవసరమని పదేపదే గుర్తు చేస్తారు. హద్దు మీరకుండా బాక్సింగ్‌లో నైపుణ్యం మెరుగుపర్చుకునేందుకు శాయశక్తులా కృషి చేస్తున్నా.
– గంపల భరత్, 8వ తరగతి, గోపాలపట్నం హైస్కూల్

క్రీడల అడ్డగా మా గ్రౌండ్



గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్ క్రీడలకు, క్రీడాకారులకు అడ్డగా మారింది. ఇది మా పాఠశాల విద్యార్థులకే కాకుండా బయటవారికి కూడా ఎంతగానో ఉపయోగపడుతోంది. పాఠశాల సమయాల్లో కాకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో బయటి వ్యక్తులు ఇక్కడ ప్రత్యేక శిక్షణ ఇచ్చి విద్యార్థుల్లో ప్రతిభకు సానబెడుతున్నారు. అది చాలా సంతోషకరం.
– సత్యకళ, పీఈటీ, గోపాలపట్నం హైస్కూల్

విద్యార్థుల ప్రతిభతో సంతృప్తి



ఇక్కడి హైస్కూల్ గ్రౌండ్‌లో వైఎఫ్ బాక్స్ క్లబ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలో బంగారు పథకాలు సాధించారు. వారి ప్రతిభ మాకు ఎంతో సంతృప్తినిచ్చింది. చాలా మంది స్పోర్ట్స్ సర్టిఫికెట్ల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు సాధించారు. ఇపుడు ఆయా శాఖల తరపున క్రీడల్లో పాల్గొంటూ మెడల్స్ సాధిస్తున్నారు.
– ఎస్ఎస్ ప్రభాకర్, బాక్సింగ్ కోచ్

దేవన్‌రెడ్డికి అభినందనలు


దేవన్‌రెడ్డికి శాలువా వేసి, అభినందిస్తున్న పార్టీ నాయకులు

మల్కాపురం: గాజువాక నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా ఇటీవల నియమితులైన తిప్పల దేవన్‌రెడ్డిని పారిశ్రామిక ప్రాంతానికి చెందిన పార్టీ నాయకులు కలిసి, శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించారు. శుక్రవారం దేవన్‌రెడ్డి ఇంటికి వెళ్లి అభినందించారు. కార్యక్రమంలో 58వ వార్డు నాయకులు గులిగిందల కృష్ణ, జింక్ ఆంజనేయస్వామి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ గంట్యాడ వాసు, గొందేశి సత్యనారాయణరెడ్డి, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఓటరు దినోత్సవం


ఓటు అక్షర క్రమంలో విద్యార్థులు

మల్కాపురం: జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శుక్రవారం 58వ వార్డు పిలకవానిపాలెం లక్కీ అమర్ పాఠశాల వద్ద ఓటర్ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఓట్ ఆంగ్ల అక్షరాల క్రమంలో ఏర్పడి, ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు పాల్గొని మాట్లాడుతూ 2011 నుంచి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'దావోస్‌లో ఏపీ బ్రాండ్‌ను చూపించారు'

గోపాలపట్నం: ప్రపంచ దేశాలు పెట్టుబడుల కోసం దావోస్‌లో పోటీ పడుతుంటే మన ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ను అక్కడి వారికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ తెలియజేశారని ప్రభుత్వ విప్ గణబాబు అన్నారు. శుక్రవారం ఆయన గోపాలపట్నంలోని తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు తీసుకొచ్చేందుకు పడిన శ్రమ ఫలించిందన్నారు. మహా విశాఖ నగరంలో పలు కంపెనీలు తీసుకువచ్చేందుకు కృషి చేశారని పేర్కొన్నారు. కుదేలైన ఏపీ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడుతున్న ఘనత చంద్రబాబుదేనన్నారు.

ఫైనల్ సెటిల్‌మెంట్ కోసం కార్మికుల నిరసన


సీ గేటు వద్ద నిరసనలో పాల్గొన్న కార్మికులు

మల్కాపురం: తమకు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఫైనల్ సెటిల్‌మెంట్ చేయకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల కార్మికులు హెచ్చరించారు. తమ సమస్యల పరిష్కారం కోరుతూ హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద శుక్రవారం నిరసనకు దిగారు.

ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో నికాన్, మాస్ తదితర కాంట్రాక్టర్ల వద్ద గత కొన్నేళ్లుగా పని చేస్తున్నామన్నారు. తమకు ఫైనల్ సెటిల్‌మెంట్ చేస్తామని చెప్పిన ఆయా సంస్థల కాంట్రాక్టర్లు ప్రభుత్వ జీవో ప్రకారం చెల్లించటం లేదన్నారు. దీంతో ఒక్కో కార్మికుడు రూ.50 వేలు వరకు నష్టపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయం చేయాలని కాంట్రాక్టర్లను కోరితే, వారు నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల నిరసన కారణంగా గేటు వద్ద ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా పోలీసులు, సీఐఎస్ఎఫ్ సిబ్బంది మోహరించారు. దీంతో దిగివచ్చిన యాజమాన్యం కార్మికులకు నచ్చజెప్పి, అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళనను విరమించారు.

'పొగ మంచు'కురిసే వేళలో..


మల్కాపురం నుంచి సింధియా వేళ్లే మార్గంలో..


ఉదయం 8 గంటల సమయంలో లైట్లు వేసుకుని వెళ్తున్న బైకర్

ఈ ఫొటోలో కనిపిస్తున్న ప్రభాత వేళలో అల్లుకున్న మంచుతెరల్ని చూసి ఏ ఊటీయో.. మన్యం ప్రాంతమో అనుకునేరు..! మల్కాపురంలోని పారిశ్రామిక ప్రాంతంలో శుక్రవారం కనిపించిన పరిస్థితి ఇది. ఉదయం 8 గంటలైనా దట్టంగా అల్లుకున్న పొగమంచు తెరలు వీడలేదు. పారిశ్రామిక ప్రాంత పరిసరాలన్నీ తెల్లటి మంచు దుప్పటితో ముసుగేసుకున్నాయి. దీనికి తోడు చలికూడా ఎక్కువ కావడంతో జనాలెవరూ రోడ్లపైకి వచ్చేందుకు సాహసించలేదు. తప్పనిసరిగా బయటికి రావాల్సిన వాహనదారులు లైట్లు వేసుకుని మరీ సర్వీస్ రోడ్లలో రాకపోకలు సాగించారు.
– మల్కాపురం

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్


వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గణబాబు, అధికారులు

విశాఖ విద్య: ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ విప్ పి.గణబాబు అన్నారు. 52వ వార్డు కరాస రామాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో ఆయన పాల్గొన్నారు. వార్డు పరిధి శాంతినగర్, సంజీవయ్య నగర్, నేతాజీ నగర్, గణేష్ నగర్, గౌరీ నగర్, న్యూ కరాస, ఓల్డ్ కరాస, మత్రిపాలెం లేఅవుట్ ప్రాంత ప్రజలు హాజరై తమ సమస్యలపై అర్జీలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యల్ని 15 రోజుల్లో పరిష్కరించి, వారి మన్ననలు పొందాలని అధికారులను సూచించారు. రేషన్ కార్డులు, పింఛన్లు, రోడ్లు, విద్యుత్ లైట్లు, ఇంటి పన్నులు తదితర సమస్యలపై ప్రజలు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో గోపాలపట్నం తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్, ప్రజా పనుల విభాగం ఈఈ తారా ప్రసన్న, ఏఎంహెచ్‌వో సునీల్ కుమార్, జోన్ 5 సర్వేయర్ లీల, ఎలక్ట్రికల్ ఏఈ జి.వెంకటేశ్వరరావు, పౌర సరఫరాల(సర్కిల్-1) ఏఎస్‌వో, విశాఖ పార్లమెంట్ కమిటీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యాముజాల తిరుమలరావు, వివిధ విభాగాల అధికారులు, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు.

పర్యాటక కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి


హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏకు చెందిన పర్యాటక కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీఎంఆర్డీఏ నిర్వహణలో ఉన్న పర్యాటక ప్రదేశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీయూ 142, సీ హ్యారియర్ మ్యూజియాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. పర్యాటకుల సౌకర్యార్థం సదుపాయాలు కల్పించాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని, పాడైన లైట్లను పునరుద్ధరించాలని, అదనపు టాయిలెట్లు ఏర్పాటుకు అంచనాలను రూపొందించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్క్ సందర్శనార్థం వచ్చిన స్కూల్ పిల్లలు, అధ్యాపకులతో ముచ్చటించి పార్క్‌లో కల్పించిన వసతుల కోసం ఆరా తీశారు. అదేవిధంగా టీయూ యుద్ధ విమాన మ్యూజియం ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థ సమర్థవంతంగా పని చేసేలా చూడాలన్నారు. యూహెచ్3హెచ్ యుద్ధ హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణ పనులను ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. తాటిచెట్లపాలెం కల్యాణమండపం నిర్వహణకు త్వరగా టెండర్లు పిలిచి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ పర్యటనలో వీఎంఆర్డీఏ సీఈ భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్లు రాజు, రామరాజు, డీఎఫ్‌వో శివాని పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 16 కిలోల గంజాయి స్వాధీనం

తాటిచెట్లపాలెం: విశాఖ రైల్వే స్టేషన్‌లో గంజాయిని గవర్నమెంట్ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే స్టేషన్‌లోని వివిధ ప్లాట్‌ఫారాల్లో శుక్రవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూర్ జిల్లాకు చెందిన రాధాకృష్ణన్, కార్తీక్ సెల్వం, అరుణ్ మోహన్, కార్తీ బాలకృష్ణన్ బ్యాగులను తనిఖీ చేయగా.. 16 కిలోల గంజాయి లభ్యమైంది. వీరిని అరెస్టు చేసి, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ధనుంజయనాయుడు, ఎస్ఐ ఎస్.రామారావు, ఆర్పీఎఫ్ ఎస్ఐ ఒబిషేక్ మిస్త్రీ తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు.

నిర్ణీత సమయంలో అర్జీలు పరిష్కరించండి

దాబాగార్డెన్స్: టౌన్‌ప్లానింగ్‌కు సంబంధించి వస్తున్న ఫిర్యాదులపై పట్టణ ప్రణాళికా సిబ్బంది స్పందించి వెంటనే పరిష్కరించాలని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు ఆదేశించారు. కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరం నిర్వహించారు. ఈ సందర్భంగా అందిన ఫిర్యాదులు స్వయంగా స్వీకరించి పరిష్కారానికై సంబంధిత అధికారులను ఆదేశించారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈవో శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన..
కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

నైతిక విలువలతోనే మెరుగైన సమాజం

హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ కృపాసాగర్


విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న న్యాయమూర్తి డాక్టర్ కృపాసాగర్

విశాఖ విద్య: నీతివంతమైన జీవితంతోనే మానవ మనుగడ ముడిపడి ఉంటుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వి.ఆర్.కె.కృపాసాగర్ అన్నారు. నైతిక విలువలతోనే మెరుగైన సమాజం సాకారమవుతుందన్నారు. ఏయూ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంబేడ్కర్ అసెంబ్లీ హాల్లో శుక్రవారం నిర్వహించిన 17వ అంతర్జాతీయ సామాజిక తత్వశాస్త్ర సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. నైతిక విలువల ఆవశ్యకతను మానవ సమాజం మరవకూడదన్నారు.

తాత్విక ఆలోచనలతోనే సమస్యల పరిష్కారం
డాక్టర్ కూటికుప్పల సూర్యారావు మాట్లాడుతూ మానవ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు తాత్విక ఆలోచనలతోనే పరిష్కారం లభిస్తుందన్నారు. ఆచార్య కూటికుప్పల సూర్యారావు ఎండోమెంట్ పురస్కారాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాఘవేంద్రకు, బెంగళూరు విశ్వవిద్యాలయం డాక్టర్ మాయ నీహ సిల్లాంగ్‌కు అందజేశారు. చదువులో ప్రతిభ కనబరిచిన హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి ఆచార్య వానపల్లి వెంకటరావు, అంతర్జాతీయ యోగ, తత్వశాస్త్ర సదస్సు వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య బసవరాజు, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, బెంగళూరు విశ్వవిద్యాలయ ఆచార్యులు పొట్టి రాజు, జయపూర్ విశ్వవిద్యాలయ ఆచార్యులు సంజీవ్ బాణావత్, యోగ కాన్షస్‌నెస్ ట్రస్ట్ విజినిగిరి ఆచార్యులు డాక్టర్ నరసింహారావు, రాయచూర్ బసవస్వామి విశ్వవిద్యాలయ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.